మేజర్ ఎకానమీస్ ఫోరం.. పర్యావరణం!!

ఇంధనం, పర్యావరణ అంశాలపై మేజర్ ఎకానమీస్ ఫోరం ఏర్పాటును అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా 2009, మార్చి 29న ప్రకటించారు. అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న దేశాల మధ్య ఎలాంటి దాపరికాలు లేకుండా నిష్పాక్షికంగా చర్చలు కొనసాగేందుకు ఈ ఫోరంను ఏర్పాటు చేశారు. మేజర్ ఎకానమీస్ ఫోరంలో జీ-8, జీ-5 దేశాలతోపాటు ఆస్ట్రేలియా, ఇండోనేషియా, దక్షిణకొరియా, డెన్మార్క్ తదితర ముఖ్య ఆర్థిక వ్యవస్థలు సభ్య దేశాలు. మేజర్ ఎకానమీస్ ఫోరం 2009, డిసెంబరులో ఐక్యరాజ్యసమితి పర్యావరణ సదస్సును నిర్వహించనుంది. వాతావరణంలోకి విడుదలవుతున్న కాలుష్య కారకాల్లో ఈ గ్రూప్ దేశాల వాటా దాదాపు 75 శాతం.

పర్యావరణ కాలుష్యం, వాతావరణ మార్పులపై జీ-8 దేశాలు, అభివృద్ధి చెందుతున్న దేశాల మధ్య భిన్నాభిప్రాయాలు నెలకొన్నాయి. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో పచ్చదనం కోసం 100 బిలియన్ల డాలర్ల మేర అవసరముంటుందని అంచనా. ఈ పచ్చదనంలో భాగంగా అడవుల పెంపకాన్ని చేపట్టడం, వాతావరణ మార్పులకు అనుకూల పరిస్థితులను కల్పించడం, ప్రొడక్షన్ టెక్నాలజీలో మార్పులు తేవడం వంటివి ఉన్నాయి. ఇది కూడా ఒక వ్యాపార అవకాశమేనని అభివృద్ధి చెందిన దేశాలు భావిస్తున్నాయి. పెట్టుబడులకు అనుకూల విధానాలు అవలంభించడం ద్వారా.. మార్కెట్ నుంచి భారీగా పెట్టుబడులను ఆకర్షించవచ్చని అభిప్రాయపడుతున్నాయి. నిజంగా అవసరంలో ఉన్న దేశాలకు 'అఫీషియల్ డెవలప్‌మెంట్ ఫండ్'ను అందజేయవచ్చునని పేర్కొంటున్నాయి. అభివృద్ధి చెందుతున్న దేశాల అభిప్రాయాలు అందుకు పూర్తి భిన్నంగా ఉన్నాయి.

టెక్నాలజీ బదిలీ:

టెక్నాలజీ బదిలీ విషయంలోనూ జీ-8 దేశాలకు, అభివృద్ధి చెందుతున్న దేశాల మధ్య ఏకాభిప్రాయఛిం లేదు. ప్రస్తుతం అత్యధిక శాతం టెక్నాలజీకి మేధో సంపత్తి హక్కుల రక్షణ ఉంది. దాంతో గ్రీన్ టెక్నాలజీ విషయంలో.. అభివృద్ధి చెందుతున్న దేశాలకు తక్కువ లైసెన్స్ ఫీజులకే టెక్నాలజీ బదిలీ అయ్యేలా ఏదో ఒక మార్గం ఆలోచించాలని భారతదేశం గట్టిగా కోరుతోంది.

గ్రీన్‌హౌస్ వాయువుల నియంత్రణ:

వాతావరణంలోకి గ్రీన్‌హౌస్ వాయువుల విడుదలను నియంత్రించే విషయంలో.. 1990ని ఆధార సంవత్సరం(బేస్ ఇయర్)గా తీసుకోవాలని భారత్, చైనా వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలతోపాటు యూరోపియన్ యూనియన్(ఈయూ) కూడా కోరుతోంది. అదే అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్ మాత్రం 2005ని ఆధార సంవత్సరంగా తీసుకోవాలంటున్నాయి.

వాతావరణ మార్పులు... భారత్:

ఆర్థిక వ్యవస్థల ప్రగతి చట్రాన్ని శిలాజ ఇంధనాల నుంచి రెన్యూవబుల్ రిసోర్సెస్(పునరుత్పాదక వనరులు) దిశవైపునకు మారేలా చేయడం అన్నిటికంటే పెద్ద సవాలుగా మారింది. శిలాజ ఇంధనాల వల్ల వాతావరణంలోకి కాలుష్య కారకాల విడుదల అధికమై... పర్యావరణానికి హాని చేస్తోంది. మేజర్ ఎకానమీస్ ఫోరం(ఎంఈఎఫ్) సదస్సులో ఇంధనం, వాతావరణ మార్పులపై ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ మాట్లాడారు. ప్రపంచ దేశాల ముందున్న ప్రధాన సవాలు... ఆర్థిక ప్రగతి చట్రం దిశను మార్చడమేనని కుండబద్దలు కొట్టారు. ఆర్థిక వ్యవస్థలు కాలుష్య కారకాలను విడుదలచేసే శిలాజ ఇంధనాలపై ఆధారపడటం కంటే... స్వచ్ఛమైన పునరుత్పాదక వనరుల వైపు దృష్టిపెట్టాలన్నారు. ఈ అంశాన్ని వాతావరణ మార్పులపై చర్చల సందర్భంగా తప్పనిసరిగా చర్చించాలన్నారు. వాతావరణ కాలుష్యం కారణంగా అధికంగా ప్రభావితమైంది, అవుతోంది అభివృద్ధి చెందుతోన్న దేశాలే. పర్యావరణ సమస్యల పరిష్కారంలో అభివృద్ధి చెందుతున్న దేశాలు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయనే వాదన నిజం కాదని భారత్ పేర్కొంది. వాతావరణ మార్పుల ప్రభావం అభివృద్ధి చెందుతున్న దేశాలపైనే అధికంగా ఉంది. అందుకే ఆయా దేశాలు ఈ అంశంపై ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నాయి. భూ వాతావరణంలోకి కాలుష్యకారకాల విడుదలను నియంత్రించే విషయంలో భారత్ అందరికంటే ఒక అడుగు ముందే ఉంటుందని మన్మోహన్ అన్నారు. అందుకోసం భారీ లక్ష్యాన్ని నిర్దేశించుకొని.. పదకొండో పంచవర్ష ప్రణాళిక చివరి నాటికల్లా గ్రీన్‌హౌస్ వాయువుల విడుదలను 20 శాతం మేర నియంత్రించాలనే జాతీయ చర్యా ప్రణాళిక(నేషనల్ యాక్షన్ ప్లాన్)ను భారత్ రూపొందించింది. పర్యావరణ సమస్యలపై 2009, డిసెంబర్‌లో కోపెన్‌హెగన్‌లో జరిగే చర్చలు ఫలప్రదంగా ముగిసేట్లు అన్నిరకాల సహాయ సహకారాలను అందించాలని భావిస్తోంది. కోపెన్‌హెగన్ ఒప్పందం భారీ లక్ష్యాలతో కూడుకొని, అందరికీ ఆమోద యోగ్యమైందిగా ఉండాలి.

ఓ వైపు పేదరికం వెంటాడుతుంటే.. మరోవైపు పర్యావరణ పరిరక్షణ చర్యలు పాటించాలనే నినాదాలను గౌరవించడం కష్టమేనని మన్మోహన్ అభిప్రాయడ్డారు. 2020నాటికల్లా 40 శాతం మేర కాలుష్యకారకాలను నియంత్రించాలనే మధ్యంతర లక్ష్యానికి పారిశ్రామిక దేశాలు కట్టుబడి ఉండాలన్నారు. 2050 కల్లా గ్రీన్‌హౌస్ వాయువుల విడుదలను పూర్తిగా నియంత్రించాలనే దిశగా 50 శాతం లక్ష్యాన్ని చేరుకోవాలంటే... పారిశ్రామిక దేశాలు భారీ లక్ష్యాలు సాధించాల్సి ఉంది. అందు కోసం మధ్యంతర లక్ష్యంగా.. 2020 నాటికల్లా 40 శాతం మేర ఉద్గారాల విడుదలను తగ్గించాల్సి ఉంటుంది. పర్యావరణ సానుకూల ఆర్థికాభివృద్ధి బాటలో నడవాలని భారత్ కోరుకుంటోంది. అందుకు అవసరమైన నిధులు, టెక్నాలజీ అందుబాటులోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వాతావరణంలోకి కాలుష్యకారకాలు విడుదల కాకుండా నియంత్రించడం ఎంతటి సవాలుతో కూడుకున్నదో... పర్యావరణానికి సానుకూలతలు ఏర్పరచుకోవడం కూడా అంతే కష్టతరం. లక్షించినట్లు ఉద్గారాల విడుదలను నియంత్రించినప్పటికీ.. ఇప్పటికే విడుదలైన కాలుష్యకారకాల ప్రభావం కొనసాగే ఆస్కారం

ఎలాగూ ఉంటుంది. వాతావరణ మార్పుల కారణంగా తలెత్తే ప్రతికూల ప్రభావాలను అభివృద్ధి చెందుతున్న దేశాలు ఈపాటికే ఎదుర్కొంటున్నాయి. పర్యావరణ కాలుష్యం కారణంగా సంభవించే విపత్తులను ఎదుర్కొనేందుకు భారత్ తన జీడీపీలో 2-2.5 శాతం మేర వ్యయం చేయనున్నట్లు ప్రకటించింది. ఇది అభివృద్ధి చెందిన దేశాల్లో ముందుముందు ఇంకా పెరిగే అవకాశముంది.

ఎంఈఎఫ్ డిక్లరేషన్:

- కొన్నిరకాల కాలుష్యకారకాల విడుదల తగ్గింపునకు సంబంధించిన లక్ష్యాలపై ఒప్పందం.
- టెక్నాలజీ బదిలీ, ఆర్థికసాయం దిశగా కృషి చేయడం.
- వాతావరణ అనుకూల టెక్నాలజీ అభివృద్ధికి సంబంధించిన పరిశోధనలపై ప్రభుత్వ రంగ పెట్టుబడులను రెట్టింపుచేయడం.
- కాలుష్య కారకాల విడుదల నియంత్రణకు అవసరమైన వనరుల సేకరణ, టెక్నాలజీ అభివృద్ధిపై దృష్టిసారించడం.
- భూగోళ సగటు ఉష్ణోగ్రత 2 డిగ్రీల సెల్సియస్‌కు మించకుండా నియంత్రించాల్సిన తక్షణ అవసరాన్ని గుర్తించడం.
- పారిశ్రామిక దేశాలు వ్యక్తిగతంగా, సగటున కూడా కాలుష్య కారకాల విడుదలకు సంబంధించి భారీ లక్ష్యాలను నిర్ణయించుకొని, పాటించాలి.
- వాతావరణ కాలుష్యానికి కారణమవుతున్న సంప్రదాయ విధానాల నుంచి భిన్నమైన ఆర్థికాభివృద్ధి విధానాలదిశగా అభివృద్ధి చెందుతున్న దేశాలు చర్యలు తీసుకోవాలి.

ఎంఈఎఫ్ డిక్లరేషన్... ప్రాధాన్యం:

- భూగోళ ఉష్ణోగ్రతను 2 డిగ్రీల సెల్సియస్‌కు పరిమితం చేయడం ఎంత అవసరమో అభివృద్ధి చెందుతున్న దేశాలు తొలిసారిగా ఎంఈఎఫ్ డిక్లరేషన్ సందర్భంగా గుర్తించాయి.
- వాతావరణ కాలుష్యంవల్ల ఉత్పన్నమయ్యే సమస్యలను ఎదుర్కొనేందుకు అవసరమైన వనరులు, టెక్నాలజీ కోసం నిధులు సమకూర్చాలనే డిమాండ్‌కు ప్రాధాన్యం లభించింది.
- కాలుష్యకారకాల విడుదలను నియంత్రించడానికి సంబంధించిన ఒప్పందం ఒక కీలక ముందడుగు.
- 2009, డిసెంబరులో జరుగనున్న కోపెన్‌హెగన్ సదస్సుకు ముందు వాతావరణ మార్పులపై విడుదలైన డిక్లరేషన్ ప్రపంచ దేశాలకు పర్యావరణ సమస్యలపై గట్టి రాజకీయ సందేశాన్ని ఇచ్చినట్లయిందని భారత్ పేర్కొంది.
- పర్యావరణ అనుకూల టెక్నాలజీలను అభివృద్ధి చేసే విషయంలో గ్లోబల్ పార్ట్నర్‌షిప్ ఆలోచన మొత్తం డిక్లరేషన్‌లోనే కీలకమైందని భారత్ అభిప్రాయపడింది.
- 2050 నాటికల్లా తమ కాలుష్యకారకాల విడుదలలో 80 శాతం మేర నియంత్రించాలన్న అమెరికా

అధ్యక్షుడు బరాక్ ఒబామా వ్యాఖ్యలు అన్నింటికంటే ముఖ్యమైనవని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

పర్యావరణం.. భారత్:

- కాలుష్యకారకాల నియంత్రణ లక్ష్యాలకు సంబంధించి జీ-8 సదస్సుల్లో భారత్ తన పట్టు సడలించిందనే అభిప్రాయాన్ని కొంతమంది విమర్శకులు వ్యక్తంచేశారు. అయితే అది నిజం కాదని వాతావరణ మార్పులపై ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ ప్రత్యేక దూత శ్యామ్ శరణ్ స్పష్టంచేశారు.
- గ్రీన్‌హౌస్ వాయువుల నియంత్రణ విషయంలో అభివృద్ధి చెందిన దేశాలు చురుకైన పాత్ర పోషించాలని సూచించారు.
- పర్యావరణ సానుకూల ప్రగతి పథానికి భారత్ కట్టుబడి ఉందని, అందుకోసం చేయాల్సిందంతా చేస్తుందన్నారు. పేదరిక నిర్మూలన, ఆర్థిక, సాంఘిక ప్రగతి, వాతావరణ మార్పులు.. ఈ మూడింటి మధ్య ఎలాంటి పరస్పర వైరుధ్యాలు లేవన్నారు.
- టెక్నాలజీ, ఫైనాన్స్, మిటిగేషన్, అడాప్టేషన్.. ఈ నాలుగు అంశాలపై భారత్ దృష్టిపెట్టాల్సి ఉందని శ్యామ్ శరణ్ పేర్కొన్నారు.